# సింగిల్ పేజీ కథ

## నైజం



పదిహేనేళ్ళ అనుభవంతో మంచి బోధనా పటిమ గల లెక్చరర్‌గా పేరు తెచ్చుకున్నాడు మనోహర్. అలా అంచెలంచెలుగా తను పనిచేస్తున్న కాలేజీకే ప్రిన్సిపాల్‌గా మారాడు. ప్రిన్సిపాల్ ఉద్యోగంతో పాటు తను నడిపే ట్యూషన్ సెంటర్‌కీ విపరీతమైన క్రేజ్ ఉంది.

అంతమంచి పేరున్న మనోహర్‌కు ఓ బలహీనత ఉంది. తన వద్ద చదివే అమ్మాయిలతో అనుచితంగా ప్రవర్తిస్తుంటాడు. ఆ అమ్మాయిలను ఏదో నెపంతో తాకడం, వారి మానసిక బలహీనతను గ్రహించి ఇంకాస్త చొరవ తీసుకోవడం తద్వారా మానసిక తృప్తి పొందుతుంటాడు.

ముక్కుసూటిగా ఉంటూ తమ పని తాము చూసుకుని వెళ్ళిపోయేవారు చాలా మంది విద్యార్థినులు. అలాకాక అతి చొరవ కల్పించుకుంటూ అతనితో ఉండే చొరవను గొప్పతనంగా భావించుకునే వారి బలహీనతను సొమ్ము చేసుకునేవాడు మనోహర్.

మనోహర్ భార్య సుమతి మాత్రం తరచుగా ఈ విషయాన్ని గమనిస్తూ ఉండేది. కానీ తను నిలదీస్తే అతనికున్న కాస్త భయం పోతుంది. పైగా ఇద్దరిమధ్య గ్యాప్ ఏర్పడే అవకాశం ఉంది. ఆమెకు అతని సంపాదన, హోదా కావాలి. అతని ప్రవర్తనలో మార్పు రావాలి. సమస్యను ఎలా పరిష్కరించుకోవాలా అని ఆమె తెగ ఆలోచిస్తూ ఉంది.

మనోహర్ వయసు, అతని వృత్తి, ఆయనకున్న పేరు వల్ల ఏ తల్లీ, తండ్రికి కూడా ఆయన గూర్చి అటువంటి ఆలోచన వచ్చేదికాదు.

మనోహర్ ఏకైక గారాలపట్టి కీర్తి. హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. తండ్రీ కూతుళ్ళిద్దరూ మంచి స్నేహితుల్లా ఉండేవారు. ఆమెకు తన తండ్రి అంటే వల్లమాలిన ప్రేమ.

ఆకాంక్ష కీర్తికి బెస్ట్‌ఫ్రెండ్. ఆమె డిగ్రీ ఫస్ట్ ఇయర్ సొంత ఊర్లోనే చదువుతూ, మనోహర్ దగ్గర ట్యూషన్ చదివేది. ఆకాంక్ష ద్వారానే కీర్తి తన తండ్రి ప్రవర్తన గురించి తెలుసుకుంది.

వాళ్ళు తరచుగా ఉత్తరాల ద్వారా లేదా కలుసుకున్నప్పుడో ఈ విషయాన్ని చర్చించుకునేవారు. మనోహర్‌కున్న మనోవికారం కీర్తికి తలనొప్పిగా అన్పించేది. అతని వింత చేష్టలు వికృతంగా కన్పించేవి. ఆమెకు రోజురోజుకు తన తండ్రిపై అసహ్యం పెరగసాగింది.

రోజురోజుకు శృతి మించుతున్న భర్త ప్రవర్తనను జీర్ణించుకోలేకపోతోంది సుమతి. అతనికుండే అవకాశాలను తొలగించడం మొదలుపెట్టింది. ఆమె తరచుగా ఏదో నెపంతో క్లాస్‌రూంలోకి రావడం, క్లాస్‌రూం తలుపులు, కిటికీలు పూర్తిగా తెరచి ఉంచడం లాంటి పనులు చేసేది.

సుమతి చేస్తున్న పనులన్నీ మనోహర్ అవకాశాలను తొలగించేవేకానీ, అతనిలోని ఆ వికృతాన్ని మాత్రం తొలగించేవి కావు.

★ ★ ★

కీర్తి సడెన్‌గా హైదరాబాద్‌నుండి ఇంటికి వచ్చింది. ఆకాంక్షతో కలిసి తన రూంలోకెళ్లిందామె. విషయం అడిగిన తల్లికి జరిగినదంత కన్నీళ్లతో చెప్పింది.

సుమతికి మనోహర్ ప్రవర్తన స్ఫురణకొచ్చింది. దుఃఖాన్ని దిగమింగింది.

హఠాత్తుగా వచ్చిన కూతురును గురించి, సుమతిని విషయం అడిగి తెలుసుకున్నాడు మనోహర్.

ఆమె కూతురి వైపు చూసింది చెప్పమన్నట్టుగా.

''డాడీ నాకు టఫ్‌గా ఉన్న సబ్జెక్టు గురించి ట్యూషన్‌కెళుతున్నాను. కానీ అక్కడి లెక్చరర్ నాతో చాలా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. స్టూడెంట్స్‌ను తమ పిల్లల్లా భావించాలని, తప్పుగా ప్రవర్తిస్తున్నారని చెప్పి చూశాను. కానీ ఆయన తన ప్రవర్తనను మార్చుకోవడం లేదు. అందుకే మీకు విషయం చెప్పి మీచేత అతనికి వార్నింగ్ ఇప్పించాలని వచ్చాను'' చెప్పింది కీర్తి.

కూతురు కన్నీళ్ళు చూసేసరికి రక్తం ఉడికిపోయింది మనోహర్‌కు.

మరుక్షణం చెంపమీద ఎవరో ఛెళ్ళుమనిపించినట్లయింది తన గురించి ఆలోచన రాగానే.

మౌనంగా అక్కడినుంచి కదిలాడు.

ఆ రోజంతా ముక్తసరి మాటలతో ముభావంగా గడిపాడు. తను ఇంతకాలం ఎంత తప్పుచేస్తున్నాడో తెలిసొచ్చింది మనోహర్‌కి. తన మీద తనకే అసహ్యం వేస్తోంది.

''మీరేం రావద్దులే డాడీ. నేను ట్యూషన్ మానేస్తాను. వేరే ఎక్కడికైనా వెళ్తాను. లేదంటే కష్టపడి ప్రిపేరవుతాను'' అంది కీర్తి మరుసటిరోజు ఉదయం మనోహర్ దగ్గరకొచ్చి.

సరేనంటూ బదులిచ్చాడు మనోహర్.

మనోహర్ ప్రవర్తనలో బాగా మార్పు వచ్చింది. సుమతికి చాలా సంతోషంగా ఉంది. కీర్తి కూడా ఈ విషయాన్ని ఆకాంక్ష ద్వారా తెలుసుకుంది.

★ ★ ★

వంటింట్లో ఉన్న సుమతి ఫోన్ రింగవగానే హాల్లోకొచ్చి లిఫ్ట్ చేసింది.

''హలో మమ్మీ!'' అంటూ విష్ చేసింది ఫోన్‌లో కీర్తి.

కుశలప్రశ్నలడిగాక ''చాలా థాంక్స్యారా కీర్తి'' అంది సుమతి.

''ఎందుకు మమ్మీ!'' అని ప్రశ్నించింది కీర్తి.

''మీడాడీలో మార్పు వచ్చినందుకు, సారీ మార్పు తెచ్చినందుకు'' చెప్పింది సుమతి.

''మార్పేమిటి?...తేవడమేమిటి?'' ఆశ్చర్యంగా ప్రశ్నించింది కీర్తి.

''నాకు అంతా తెలుసు. నువ్వు, ఆకాంక్ష మాట్లాడుకుంటున్నప్పుడే విన్నాను'' చెప్పింది సుమతి.

''అయితే నాకు ఇంతమంచి చేయడానికి సహకరిస్తూ, సలహాలిచ్చిన ఆకాంక్షకు మనం థ్యాంక్స్ చెప్పాలి మమ్మీ'' అంది కీర్తి.

''మీ డాడీకి నువ్వంటే ప్రాణం. ఆయన ఆశలన్నీ నీపైనే. పైగా మనం కోరుకున్న మార్పు

వచ్చింది...'' తండ్రీ కూతుళ్ళ మధ్య గ్యాప్ రాకుండా చేయాలనే తపనతో అంది సుమతి.

''నువ్వు వేరే చెప్పాలా? బై! మమ్మీ ఉంటాను'' అని చెప్పి ఫోన్ పెట్టేసింది కీర్తి.

సరిగ్గా సుమతి లిఫ్ట్ చేసినప్పుడే ఫోన్ లిఫ్ట్ చేసిన మనోహర్ ఈ సంభాషణంతా తన బెడ్‌రూంలో ఉన్న ఎక్స్‌టెన్షన్ ద్వారా విన్నాడు. అతని ముఖాన నెత్తురు చుక్క లేదు.

తను ఇంతకాలం కళ్ళు మూసుకుని పాలుతాగుతున్న పిల్లిలా ప్రవర్తించానని, ఉపాధ్యాయవృత్తి ముసుగులో ఎన్నో ఘోరతప్పిదాలు చేశానని తెలుసుకుని సిగ్గుతో తలదించుకున్నాడు.

★ ★ ★

ఆనాటినుంచి అతని నైజం పూర్తిగా మారిపోయింది. కీర్తి ఔన్నత్యం తన మనోవికారాన్ని మనోవికాసంగా మార్చిందని గ్రహించాడు.

ప్రస్తుతం మనోహర్‌కి ప్రతి విద్యార్థిలోనూ కీర్తి కన్పిస్తోంది.

**-మాణిక్యాల శ్రీనివాసరావు**

**(హైదరాబాద్)**

# షాక్



''అమ్మాయి తెల్లగా కుందనం బొమ్మలా ఉంది. అందానికి అందం. చదువు పైగా మంచి సంప్రదాయమైన కుటుంబం. మంచి కట్నం కూడా ఇస్తామంటున్నారు. ఆ కట్నంలో కొంత వెనుక వేస్తే రేపు ఆడపిల్ల పెళ్ళికి పనికివస్తుంది కూడా. మరి నీకు ఏం ఎందుకు నచ్చలేదు'' సీతాపతి ప్రశ్నించాడు కొడుకు నరేన్‌ని.

''నచ్చలేదంటున్నానా'' అసహనంగా నరేన్ జవాబు.

''అదే...అదే...పదేపదే నచ్చలేదు అని ఆ నాలుగు అక్షరాలు చెప్పడం కాదురా. దానికో కారణం ఉండాలి. నీతోపాటు, అమ్మ, చెల్లి, నేను చూశాం. నలుగురిలో ముగ్గురికి ఆ అమ్మాయి నచ్చింది. నీ ఒక్కడికే నచ్చకపోవడానికి ఆమెలో ఉన్న లోపం ఏంటి'' గర్జిస్తున్నట్లుగా అన్నాడు తండ్రి సీతాపతి.

''మీకు నచ్చితేసరా! పెళ్ళిచేసుకుని కాపురం చేసేవాడిని నేనా? మీరా'' నరేన్ వేసిన ఈ ప్రశ్నకి సీతాపతికి కళ్ళు పచ్చబడ్డాయి. చోద్యంలా చూస్తున్న తల్లి పూర్ణమ్మకి మతిపోయినంత పని అయింది బుగ్గ చెళ్ళు మనిపించేలా కొడుకుని కొట్టాలనుకుంది. కాని తండ్రిని అంతటి ప్రశ్న వేసినవాడు తిరిగి తనని కొట్టకపోతాడా? అన్న భయంతో ఆగిపోయి

''ఒరేయ్ నరేన్. ఎవరితో మాట్లాడుతున్నావురా?'' అంది గొంతుక పెంచి.

''అవునమ్మా...నేనేం చేసేది. నచ్చలేదు అని చెబుతుంటే నాకెందుకీ బలవంతం''

''అవున్రా. నువ్వు చెప్పింది నేను వింటాను. అవతల పిల్లతండ్రి ఎంతో ఆశతో మంచి శుభవార్త చెప్తామని కోటి ఆశలతో ఎదురుచూస్తూ ఉంటాడు. పిల్ల నిజంగా అనాకారి అయితే...నేను నిర్భయంగా చెప్పేద్దును మావాడికి నచ్చలేదండీ అని. కాని అమ్మాయిలో లక్ష్మీకళ ఉట్టిపడుతోంది. అంత చక్కని అమ్మాయి నచ్చలేదు అని ఎలా చెప్పగలన్రా..నే పట్టిన కుందేలుకు మూడేకాళ్ళన్నట్లు మొండిగా మాట్లాడకుండా ప్రశాంతంగా మరోసారి ఆలోచించు'' ప్రాధేయపడుతూ సీతాపతి చెప్పడంతో..

''ఒకటికి పదిసార్లు ఆలోచించే చెబుతున్నా న...చ్చ...లే...దు...అర్థం అయిందా?'' అక్షరాలను విడదీస్తూ, దీర్ఘాలు తీస్తూ బదులిచ్చాడు నరేన్.

''నచ్చకపోవడానికి కారణం ఏంటిరా?''

''నేను ఇంకో అమ్మాయిని ప్రేమించాను'' మెల్లగా నరేన్ జవాబు.

''అనుకున్నాను ఇలాంటి ప్రేమ వైరస్ ఏదో సోకి ఉంటుందని. అందుకే కుందనపు బొమ్మ లాంటి అమ్మాయి ఆ కళ్లకి నచ్చకపోవడం. మన ఇంటా వంటా ఇలాంటి ప్రేమ వ్యవహారాలు లేవురా. నువ్విలా ఎవరినో ప్రేమించేసి, దానినే పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే రేపు నీ చెల్లిని ఎవరు పెళ్ళి చేసుకుంటారు'' ఆక్రోశించాడు సీతాపతి.

''దాని సంగతి నాకు తెలీదు. నేను మాత్రం ఈ అమ్మాయిని చేసుకోనుగాక చేసుకోను. నేను ప్రేమించిన అమ్మాయిని తప్ప మరొకరిని పెళ్లాడే ప్రశ్న లేదు'' ఖరాకండిగా జవాబు చెప్పిన నరేన్ దగ్గరకి వెళ్ళి...

''చూడు నరేన్. ఈ ప్రేమలు...పెళ్ళిళ్ళు ఎక్కువకాలం నిలవ్వు. నీకంత మొండి పట్టుదల ఎందుకు. ఏంటి ఆ అమ్మాయిలో ఉన్న ప్రత్యేకత. ఈ అమ్మాయిలో లేనిదేంటి?'' అంటూ ప్రాధేయపడుతున్న తండ్రికి షాక్‌లాంటి జవాబు విన్పించింది.

''ఆమె నా పదిరోజుల బిడ్డకి తల్లి. ఇంకా నర్సింగ్‌హోంలోనే ఉంది''.

**-భళ్లమూడి నాగరాజు**

**(రాయగడ)**

## కథానిలయం ట్రస్ట్ వినతి

తెలుగు అకాడమీ-కథానిలయం సంయుక్త నిర్వహణలో 'కథాకోశం' పేర తెలుగు కథకు రిఫరెన్స్‌బుక్ తేవడానికి సెప్టెంబర్ 1, 2003 నుంచి కృషి జరుగుతోంది.

పదుగురు సలహా సభ్యుల సూచనమేరకు ఒక్కొక్క ఆరోపంలో కథ, కథానిక లేక గల్పికలు, రాసిన కథకుల పూర్తి పేరు, కలంపేరు. పుట్టినతేదీ, స్వస్థలం, విద్య, ఉద్యోగం లేదా వృత్తి, చిరునామా, ప్రచురించిన కథా సంపుటాల పేర్లు, ప్రచురణ వివరాలు, కథలు సంకలనాల్లో వస్తే సంకలనాల వివరాలు, కథలకు లభించిన ప్రభుత్వ అవార్డులు (కథా సంపుటాలూ, సంకలనాలలో వచ్చిన మొత్తం కథల పేర్లు) పత్రికల్లో వచ్చిన కథల విషయంలో కథ పేరు, పత్రిక పేరు, ప్రచురించిన తేదీ నమోదవుతాయి.'కథాకోశం' సాధ్యమైనంత సమగ్రం చేయడానికి కథకులూ, కథాభిమానుల సహకారం అర్థిస్తున్నాం. ఇదివరకే కథానిలయానికి వివరాలు ఇచ్చినవారు మారిన చిరునామాలూ, ఇటీవల ప్రచురించిన కథల జిరాక్స్‌లూ ఇంతవరకూ పంపించకపోతే ప్రకటించిన కథా సంపుటాలూ, ఉద్యోగం లేదా వృత్తి వంటి అదనపు సమాచారం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో కథానిలయానికి పంపించగోర్తాము.ఇంతవరకూ కథానిలయానికి వివరాలివ్వని కథకులు ఒకకార్డు మీద తమ చిరునామా తెలియజేస్తే వివరాల కోసం కథానిలయం ఒక ఫారం పంపుతుంది. కీర్తిశేషులైన కథకుల విషయంలో వారి వారసులుగాని, అభిమానులూ, మిత్రులు గాని ఉత్తరం రాసి ఫారం తెప్పించుకుని సాధ్యమైనన్ని వివరాలు ఇవ్వవచ్చును.

చిరునామా

**కథానిలయం ట్రస్ట్, విశాఖ 'ఎ'కాలనీ దరి, శ్రీకాకుళం-532001 ఫోన్ నెం: 08942-220069**